
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 17 ఫిబ్రవరి 2024





రోప్‌లతో భక్తులను చెదరగొడుతున్న పోలీసులు

కమనీయం.. ఆదిత్యుడి నిజరూపం



పుష్పాలంకరణలో ఆదిత్యుడు

- అరసవల్లిలో ఘనంగా రథసప్తమి వేడుకలు
- లక్షమందికిపైగా తరలివచ్చిన భక్తులు



క్యూలైన్‌లో నీడ లేక భక్తుల ఇక్కట్లు



రూ.500 టికెట్ క్యూలైన్‌లో భక్తులు ఇలా..

శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/అరసవల్లి, ఫిబ్రవరి 16: అరసవల్లిలో శ్రీ సూర్యనారాయణ స్వామి జయంతి (రథసప్తమి) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదిత్యుడి నిజరూప దర్శనాన్ని చూసి తరించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. గురువారం రాత్రి 12.30 గంటల నుంచి వేడుకలు ప్రారంభమయ్యాయి. విశాఖ జిల్లా శారదాపీఠానికి చెందిన ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి హాజరై ఆదిత్యుడికి తొలిపూజ చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామికి పట్టువస్త్రాలను పాలకమండలి సభ్యులు, ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులతో కలిసి సమర్పించారు. అనంతరం ఆదిత్యుడు మూల విరాట్‌కు క్షీరాభిషేకం నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్ర 4 గంటల వరకు స్వామి నిజరూప దర్శనం కల్పించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఆరు గంటల వరకు పుష్పమాలార్చన, ఆతర్వాత విశేష అర్చన, ద్వాదశ హారతి.. ప్రత్యేక సేవలు స్వామివారికి నిర్వహించారు. రాత్రి స్వామివారి మూలవిరాట్‌ను అలంకరించారు. ఆదిత్యుడిని దర్శించుకునేందుకు జిల్లాతోపాటు ఆంధ్రా, ఒడిశా ఇతర ప్రాంతాల నుంచి సుమారు లక్ష మందికిపైగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ఆవరణ అంతా ఆదిత్యుడి నామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజామునే దాతలు, వీఐపీ క్యూలైన్లు స్తంభించిపోవడంతో సాధారణ భక్తులు ఇబ్బందులు పడ్డారు.

- డోనర్ పాస్‌లు ఉన్న క్యూలైన్లలో భక్తులు స్వామి దర్శనం కోసం సుమారు మూడుగంటలకుపైగా నిరీక్షించారు. అలాగే ఉచిత దర్శనం క్యూలైన్లలో భక్తులు ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడుతూ.. అసహనానికి గురయ్యారు. భక్తులకు ఉచిత ప్రసాదం, ఇతరత్రా సౌకర్యాలు వంటివి దేవదాయశాఖ తరఫున కనిపించలేదు. పలు స్వచ్ఛంద సేవాసంస్థల నిర్వాహకులు భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి, ఉప్మా, టీ, తాగునీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు.



ఆదిత్యుడి సన్నిధిలో జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా దంపతులు

ఆదిత్యా.. ఇవేం కష్టాలు?

- ఏర్పాట్లలో అధికారుల వైఫల్యం
- తీవ్ర ఇబ్బందులు పడిన భక్తులు
- రూట్‌మ్యాప్ కూడా చేయని వైనం
- టికెట్ల వ్యవహారంలోనూ ఆరోపణలు
- పోలీసుల అత్యుత్సాహంపై విమర్శలు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 16: అరసవల్లిలోని రథసప్తమి ఏర్పాట్లలో ఆలయ అధికారుల లోపాల కారణంగా భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. గురువారం అర్ధరాత్రి 12 గంటల నుంచి స్వామిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. క్యూలైన్లలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వీఐపీ, వీవీఐపీ, డోనర్ పాస్‌లు, రూ.500 టికెట్ కొనుగోలు చేసిన భక్తులు ఎటువెళ్లాలో తెలియక అవస్థలు పడ్డారు. మరోవైపు వీఐపీల తాకిడి కూడా పెరగడంతో ఆలయ సింహద్వారం తోపులాట జరిగింది. భక్తులకు దిక్సూచి చూపే రూట్‌మ్యాప్‌లను కూడా ఆలయ అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో సింహద్వారం వద్దకు పెద్ద ఎత్తున భక్తులు చేరుకోవడంతో గందరగోళం నెలకొంది. అర్ధరాత్రి 2 గంటల నుంచి 4 గంటల వరకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో తోపులాట చోటుచేసుకుంది.

- రథసప్తమి వేడుకల్లో భాగంగా ఆదిత్యుడ్ని దర్శించుకునేందుకు వీఐపీలు, వీవీఐపీల కోసం సుమారు 3వేల టిక్కెట్లు ముద్రించారు. వీటిలో కొన్ని టిక్కెట్లను యూనియన్ బ్యాంకు ద్వారా విక్రయించి భక్తులకు వీఐపీ దర్శనం కల్పించేలా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. ఆర్డీవో నుంచి లేఖ తీసుకున్నవారికి యూనియన్ బ్యాంకులో ఈ టిక్కెట్లు విక్రయించారు. ఇంతవరకూ బాగానే ఉన్నా.. ఈ టికెట్ల వ్యవహారం వెనుక పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- అలాగే క్షీరాభిషేకం కోసం వీఐపీలు తీసుకున్న టిక్కెట్లపై నిర్ణీత సమయం ముద్రించడంతో వారంతా అవస్థలు పడ్డారు. కొంతమంది భక్తులు టిక్కెట్లు పట్టుకుని రాగా పోలీసులు, ఆలయ సిబ్బంది అడ్డుకున్నారు. టికెట్‌పై కేటాయించిన సమయంలోనే రావాలంటూ వారికి స్పష్టం చేశారు. దీంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సమయపాలనపై ముందు అవగాహన కల్పించలేదని వాపోయారు.

- ఆలయానికి వచ్చిన దాతలు, వీఐపీలను పోలీసులు రద్దీ పేరుతో తోసేశారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పీఏ భవానిని సైతం నెట్టేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబసభ్యులకు ఎటువంటి పాసులు లేకపోయినా సింహద్వారం గుండా దర్శన అవకాశాలు కల్పించడంపై భక్తులు విమర్శలు గుప్పిస్తున్నారు.



ఆలయం వద్ద దోనర్లు, వీఐపీలను తోసేస్తున్న పోలీసులు

దాతలను అవమానించడం సరికాదు

ఆలయ అభివృద్ధి కోసం విరాళాలు ఇచ్చే భక్తులకు డోనర్ పాసులు ఇచ్చి.. రథసప్తమి రోజు క్షీరాభిషేకం దర్శనానికి అవకాశం కల్పిస్తారు. ఈ ఏడాది దాతలకు క్యూలైన్లు ఎక్కడ ఏర్పాటు చేశారో తెలియని పరిస్థితి నెలకొంది. ఆలయంలో పనిచేసే ఉద్యోగులు ఒక్కొక్కరూ పదుల సంఖ్యలో బయటవారిని తీసుకెళ్లి దర్శనం చేయించారు. దాతలను మాత్రం పట్టించుకోకపోవడం దారుణం. ఇలా దాతలను అవమానపరచడం సరికాదు.



\- డబ్బీరు శ్రీనివాసరావు(వాసు), శ్రీకూర్మం పాలక మండలి సభ్యుడు



అరసవల్లిలో సింహద్వారం వద్ద భక్తుల రద్దీ..

కలెక్టరేట్ నిర్మాణం పూర్తిచేయాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఫిబ్రవరి 16: సమీకృత కలెక్టర్ కార్యాలయ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులను పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెలాఖరు నాటికి పూర్తిచేయాల్సి ఉండగా.. ఇంకా 25శాతం పెండింగ్ పనులు ఉండడంపై కాంట్రాక్ట్ ప్రతినిధులను ప్రశ్నించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్‌అండ్‌బీ, ఎస్‌ఈ జాన్ సుధాకర్, ఈఈ రవినాయక్, డీఈఈ ఎంఎల్‌వీ సాగర్, ఏఈఈ పీటీ రాజు, కాంట్రాక్టు ప్రతినిధి ప్రసాద్ పాల్గొన్నారు.



పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

గరుడఖండి పోస్టాఫీస్‌లో నగదు పక్కదారి

- విధులకు హాజరుకాని బీపీఎం
- ఆందోళనలో ఖాతాదారులు

పలాస రూరల్, ఫిబ్రవరి 16: గరుడఖండి తపాలా కార్యాలయంలో ఖాతాదారుల సొమ్ము పక్కదారి పట్టింది. దీంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ పోస్టాఫీస్‌లో గరుడఖండి, మహాదేవిపురం, బట్టుపాడు, సరియాపల్లి, కిష్టుపురం, జగదేకపురం గ్రామాల ప్రజలు పొదుపు ఖాతాల ద్వారా నగదును జమ చేస్తున్నారు. ఈ కార్యాలయంలోని బీపీఎం ప్రశాంత్‌కుమార్ గత నెల 12 నుంచి విధులకు హాజరు కాకపోవడం, ఖాతాదారుల నగదు వివరాలు ఆన్‌లైన్ చేయకపోవడం, లావాదేవీలకు సంబంధించిన బయోమెట్రిక్ సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో నగదు పక్కదారి పట్టిందనే విషయం ఖాతాదారులకు చేరింది. రూ.2 లక్షల వరకూ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. దీంతో ఖాతాదారులంతా పోస్టాఫీసుకు చేరుకొని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం మెయిల్ ఓవర్‌సీర్ ఎం.సాంబమూర్తి ఆధ్వర్యంలో సుమారు 150కుపైగా ఖాతాలను పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామని ఆయన తెలిపారు. ఈ విషయంపై జిల్లా సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. 'ఖాతాదారులు పొదుపు చేసిన నగదులో కొంతమేర బీపీఎం ప్రశాంత్‌కుమార్ పోస్టల్ శాఖకు చెల్లించలేదు. ఆ సొమ్మును రికవరీ చేసి ఖాతాదారుల అకౌంట్లలో జమ చేస్తాం. దీనిపై ఆందోళన చెందవద్దు. ఉద్యోగి విషయంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చా'మని తెలిపారు.

అంతా మా ఇష్టం!

- కుంకుమసాగరంలో మట్టి అక్రమ తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

(పలాస)

అక్రమార్కులు కంకర మట్టినీ వదలడం లేదు. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలోని పాత జాతీయరహదారి మూడోవార్డు పెంటిబద్ర గ్రామానికి సమీపంలో ఉన్న కుంకుమసాగరం చెరువులో యథేచ్ఛగా మట్టిని తవ్వేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకపోయినా రోజూ 500 నుంచి వెయ్యి ట్రాక్టర్లు వరకూ కంకరను తవ్వుతూ.. చెరువు స్వరూపాన్ని మార్చేస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ శాఖల నిబంధనలను ఉల్లంఘించి.. రాజకీయ అండతో ఇష్టారాజ్యంగా బరి తెగిస్తున్నారు. పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో నిర్మాణ పనులకు వీటిని వినియోగిస్తున్నారు. మూడు టన్నుల మట్టిని రూ.750 నుంచి రూ.వెయ్యి వరకూ విక్రయిస్తున్నారు. గతంలో కుంకుమసాగరంలో తవ్వకాలు చేపట్టగా అప్పటి తహసీల్దార్ ఎల్.మధుసూదనరావు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ప్రస్తుతం అధికారులు బదిలీల్లో బిజీగా ఉండగా.. అక్రమార్కులు మళ్లీ కంకర తవ్వకాల్లో నిమగ్నమయ్యారు. కాగా మట్టి అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లకు నెంబర్ ప్లేట్లు కూడా ఉండకపోవడం గమనార్హం. దీనిపై పోలీసులు, ఆర్టీఐ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. మట్టి, కంకర, ఇసుక, రాళ్లపై సెస్‌ను వినియోగించుకునే విశ్వసముద్ర ప్రైవేటు సంస్థలో కొంతమంది సిబ్బంది సైతం అక్రమార్కులతో చేతులు కలిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు కూడా స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా వార్డుకు దగ్గరలో ఉన్న కుంకుమసాగరంలో విద్యార్థులు, స్థానికులు స్నానాలకు దిగుతుంటారు. చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేపట్టడంతో గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గతంలో ముగ్గురు పిల్లలు ఈ గోతుల్లో పడి మృతి చెందారు. అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమార్కుల నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై తహసీల్దార్ ఎస్ఎస్‌వీఎస్ నాయుడు వద్దప్రస్తావించగా ఆర్ఐ, వీఆర్వోలను తక్షణమే పంపించి పనులు నిలుపుదల చేస్తామన్నారు.



నెంబర్ ప్లేటు లేని ట్రాక్టర్‌లో మట్టి రవాణా..



కుంకుమసాగరంలో అక్రమంగా తవ్వుతున్న మట్టి..

పీఏసీఎస్‌లకు గుదిబండ

- గోదాముల నిర్మాణ భారంతో సతమతం
- ఆదాయ మార్గాలు లేక సొసైటీలకు కష్టకాలం



మెళియాపుట్టిలో నిర్మిస్తున్న గోదాం

(మెళియాపుట్టి)

ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘాలకు గోదాముల నిర్మాణం తలకు మించిన భారమవుతోంది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఆయా సంఘాలు అప్పుల్లో ఊబిలో పడుతున్నాయి. రైతుల ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలతోపాటు వాటికి అనుబంధంగా గోదాముల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. వీటి బాధ్యత పీఏసీఎస్‌లకు అప్పగించింది. ఈ నేపథ్యంలో నిధుల కోసం ఆయా సంఘాలు జిల్లా కేంద్ర సహ కార బ్యాంకు(డీసీసీబీ) నుంచి రుణాలు తీసుకున్నాయి. తొలిదశలో నిర్మాణాలు పూర్తికాకపోవడం.. ఆదాయ మార్గాలు లేకపోవడంతో రుణాలు ఎలా చెల్లించాలో తెలియక పీఏసీఎస్ సంఘాల పరిధిలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నష్టాల్లో ఉన్న పీఏసీఎస్‌లపై గోదాల నిర్మాణం గుదిబండగా మారిందని వాపోతున్నారు. రుణాల స్థానంలో ప్రభుత్వమే నిధులు విడుదల చేయాలని గతేడాది రైతులు ఆందోళన చేశారు. కానీ, ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో వారంతా అయోమయం చెందుతున్నారు.

- జిల్లాలో 24 గోదాముల నిర్మాణానికి రూ.40 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. ఒక్కొక్కటీ సుమారు 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు నిర్మిస్తున్నారు. ఈ భవనాలు గతేడాది డిసెంబరు నాటికే పూర్తి కావాల్సి ఉండగా.. ప్రస్తుతం చాలా చోట్ల పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే పీఏసీఎస్‌ల్లో అధికారుల జీతభత్యాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కో గోదాము నిర్మాణానికి రూ.40లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఇందులో పీఏసీఎస్ తక్షణమే రూ.4 లక్షలు భరించాలి. మిగిలిన 36 లక్షలు డీసీసీబీ ద్వారా రుణాలు తీసుకుని కాంట్రాక్టర్‌కు ఇవ్వాలి. ఈ రుణాలు ఏడాదికి రూ.4.88లక్షలు అసలు, వడ్డీ రూ.1.28 లక్షలు చొప్పున డీసీసీబీ చెల్లించాలి. పీఏసీఎస్‌లు అప్పు చేసి నిర్మించిన ఈ గోదాముల్లో పంట ఉత్పత్తులు, ఎరువులు నిల్వ చేసుకోవడం అద్దె రూపంలో రూ.లక్షల ఆదాయం వస్తుందని, వాటి ద్వారా రుణాలు తీర్చుకోవచ్చని అధికారులు సూచించారు. కాగా ఈ గోదాములు ఊరికి దూరంగా, రవాణా సదుపాయం లేని కొండల ప్రాంతాల్లో నిర్మిస్తుండడంతో ఎవరూ అద్దెకు తీసుకునే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం ధాన్యం సీజన్ కూడా పూర్తయిపోవడంతో రైతులు నిల్వలు చేసుకునే అవకాశాలు లేవు. ప్రస్తుతం ఆదాయ మార్గాలు లేక అప్పులు ఊబిలో కూరుకుపోతున్నామని సహకార సంఘాల రైతులు వాపోతున్నారు.

పనులు కొనసాగుతున్నాయి

డీసీసీబీ రుణంతో గోదాములు నిర్మిస్తున్నాం. ఇంకా పనులు పూర్తికాకపోవడంతో అద్దెలకు ఇవ్వటం లేదు. నిర్మాణం పూర్తయిన తర్వాత రైతులకు అద్దెకు గోదాములు ఇస్తాం.

\-వాసునాయుడు, సీఈవో, కొసమాళ పీఏసీఎస్, మెళియాపుట్టి

ఓపీఎస్‌ను అమలు చేయాలి



నినాదాలు చేస్తున్న తపాలా ఉద్యోగులు

కాశీబుగ్గ: ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను తిరిగి అమలు చేయాలని జిల్లా పోస్టల్ ఉద్యోగ సంఘాల నాయకులు ఎన్.నందికేశ్వరరావు, గురుమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం కాశీబుగ్గ ఉప తపాలా కార్యాలయం ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. 8వ వేతన సవరణ కమిటీని తక్షణమే నియమించాలని, కమలేష్ చంద్రా కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని, 18 నెలల కరువు భత్యం బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు రాము, మోహన్‌రావు, సతీష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే శిక్షలు



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీనివాసరావు

టెక్కలి: పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే చట్ట రీత్యా కఠిన శిక్షలు తప్పవని సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు అన్నారు. శుక్ర వారం స్థానిక 200 పడకల జిల్లా కేంద్ర ఆసుపత్రిలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. స్త్రీలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, సూపరింటెండెంట్ సూర్యారావు, ఆర్ఎంవో మహరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికలపై నిర్లక్ష్యం తగదు

టెక్కలి: గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై నిర్లక్ష్యం తగదని టెక్కలి డివిజినల్ పంచాయతీ అధికారి ఐ.రమణ అన్నారు. శుక్రవారం స్థానిక డీఎల్‌పీవో కార్యాలయంలో డివిజన్‌స్థాయి ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు, రీసోర్స్ పర్సన్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక వేగవంతం చేయాలన్నారు. అలాగే 2022-23 సంవత్సరానికి సంబంధించి సప్లమెంటరీ ప్లాన్ సర్పంచ్‌లతో వెంటనే సమావేశమై ప్రణాళిక తయారుచేయాలన్నారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్లు పేడాడ ఆనందరావు, పి.ప్రసాదరావు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన యువకులు

నందిగాం: మండలంలోని శివరాంపురం, దేవుపురం పంచాయతీలకు చెందిన యువకులు బి.రమేష్, ఎస్.రాంబాబు, ఆర్.భరత్, ఎన్.రాజు, ఎస్.షణ్ముఖ, డిల్లీ, ఎ.సాయిచరణ్, తదితరులు శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. వీరికి జనసేన మండల అధ్యక్షుడు పేడాడ చిరంజీవి, నాయకులు సలాసుని షణ్ముఖరావు, సోమేశ్వరరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఉద్దానం నీరు వృథా



నల్ల బొడ్లూరు, అంబుగాం వద్ద ఉద్దానం ప్రాజెక్టు పైపులైన్ నుంచి లీకవుతున్న నీరు

హరిపురం: మందస మండలం నల్ల బొడ్లూరు, అంబుగాం గ్రామాల సమీపంలో ఉద్దానం ప్రాజెక్టు పైపులైన్ నుంచి తాగునీరు లీకై వృథాగా పోతుంది. కొందరు స్థానికులు ఈ నీటిని బిందెల్లో నింపుకొని తమ అవసరాలకు వినియోగిస్తున్నారు. మరికొంత మంది జీడి, కొబ్బరి తోటల్లో వాల్వ్‌లు తొలగించి మొక్కలు పెంచేందుకు వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా పైపులైన్ లీక్‌లను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

జి.సిగడాం: కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో కౌలు రైతులు డిమాండ్ల సాధన కోసం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు, నష్టపరిహారం, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు నిలుపుదల చేయాలన్నారు. రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు కేరళ తరహా రుణ ఉపశమన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.శ్రీను, డి.పోతయ్య, ఇతర సంఘ నాయకులు శివుడు, భాస్కర్, ఎం.శ్రీను, జగదీశ్వరరావు, కోదండం, రాజుబాబు, మజ్జి కన్నంనాయుడు, నాయిన రామిరెడ్డి, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం కార్మికుల ర్యాలీ

ఆమదాలవలస: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఏఆర్ ఎస్, ఆర్ఏఆర్ఎస్ కేవీకేల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాగోలులోని వ్యవసాయ పరిశోధనా స్థానం, ఆమదాలవలస పట్టణంలోని ఆచార్య ఎన్జీ రంగా పరిశోధనా స్థానం ఎదుట కార్మికులతో కలిసి నిరసన తెలిపి, ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం కాంట్రాక్ట్ కార్మికుల అధ్యక్షురాలు ఎన్.సీతామహాలక్ష్మి, కార్యదర్శి త్రివేణి, కె.కృష్ణవేణి, సుజాత, కొండమ్మ, జ్యోతి ప్రసాద్, శ్రీను, అంబటి యుగంధర్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

కలెక్టరేట్: పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా కలెక్టర్లను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి ఓట్లు తొలగింపులు, చేర్పులు, పోలింగ్ సిబ్బంది తదితర విషయాలపై ఆయన శుక్రవారం కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వాటిపై తీసుకున్న చర్యలను కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, ఎస్పీ జీఆర్ రాధిక వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డీఆర్వో ఎం.గణపతిరావు, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, ఆర్డీవో రంగయ్య, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారి పెళ్లిరాట

రణస్థలం: కమ్మసిగడాం మహాలక్ష్మి అమ్మవారి జాతర ఈనెల 18న మూడు రోజుల పాటు జరగనుంది. ఈ మేరకు శుక్రవారం ఉదయం పెళ్లిరాటను ఆలయ ప్రాంగణంలో వేశారు. జాతరకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని, రెండు లక్షలకు పైబడి భక్తులు వస్తారని కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. భక్తుల వినోదం కోసం మూడు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వెలిచేటి రామకృష్ణ, వెలిచేటి రాజరవిచంద్ర, తేజ, వెలిచేటి రాజశేఖర్, మన్నె లక్ష్మీప్రసాద్, రాయుడు, వీజేఎస్ఎల్‌సీ మౌళి, గురాల రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిలక్ జన్మదిన వేడుకలు



కేక్‌ను కట్ చేస్తున్న తిలక్, మంత్రి అప్పలరాజు, కృష్ణదాస్ తదితరులు

నందిగాం: రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్, వైసీపీ జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. నందిగాం వైసీపీ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, తిలక్ యువసేన ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మంత్రి అప్పలరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ కేక్‌ను కట్‌చేసి తిలక్‌కు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన అభిమానులు, పార్టీ శ్రేణులు తిలక్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. తిలక్, భార్గవి దంపతుల్ని గజమాలతో సత్కరించారు. వందలాది మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, జడ్పీటీసీ పేరాడ భార్గవి, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



రణస్థలం: బైక్ ర్యాలీ చేపడుతున్న కార్మికులు



పలాస కాశీబుగ్గలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



వజ్రపుకొత్తూరు: నగరంపల్లి గ్రామంలో..

కేంద్ర విధానాలపై గర్జన

- జిల్లాలో కార్మిక, రైతు, ప్రజాసంఘాల ఆందోళన
- గ్రామీణ భారత్ బంద్ ర్యాలీలు
- కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని ఆగ్రహం

పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా జిల్లాలో ప్రజా, కార్మిక, రైతు సంఘాల నాయకులు శుక్రవారం నిరసన ప్రదర్శనలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందంటూ ర్యాలీలు నిర్వహించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతులు, కార్మికులను దగా చేసి కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని ధ్వజమెత్తారు. మతోన్మాదంతో దేశాన్ని ముక్కలు చేసి రాజ్యం ఏలాలని చూస్తుందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ నివేదిక ప్రకారం రైతాంగం పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనాలు రూ.26వేలు అమలు చేయాలని, రూ.10 వేలు ఈపీఎఫ్ పింఛన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని, విభజన హామీలు అమలు చేయాలని కోరారు. అసంఘటిత రంగ కార్మికులకు భద్రతా చట్టం చేయాలని, రవాణా రంగ కార్మికులకు ఉరి తాడు లాంటి సెక్షన్ 196(1),106(2)లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

– ఆంధ్రజ్యోతి బృందం



నరసన్నపేట: కోమర్తి గ్రామంలో ధర్నా



కోటబొమ్మాళిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ



పొందూరు: ధర్నాలో పాల్గొన్న కార్మికులు



టెక్కలి తహసీల్దార్ కార్యాలయం వద్ద..



మందసలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు



అరసవల్లి: శ్రీకాకుళంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రభుత్వ భూములు కాపాడండి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గౌతు శిరీష

పలాసరూరల్: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ, దేవదాయశాఖ భూములను కాపాడాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గౌతు శిరీష రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం డీటీ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. పురుషోత్తపురం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబరు 29లోని ఎర్రచెరువును కొంతమంది అధికార పార్టీ నాయకులు ఆక్రమించారని, దీనిపై విచారణ చేపట్టి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, పైల చక్రధర్, రవిశంకరగుప్తా, సప్ప నవీన్, సూరి, నిత్యానందపండా పాల్గొన్నారు.



పలాసరూరల్: డీటీ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న శిరీష, టీడీపీ నాయకులు

న్యాయమే గెలిచింది

పలాస: రాజధాని ఫైల్స్ సినిమా విషయంలో న్యాయమే గెలిచిందని గౌతు శిరీష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టు తీర్పు ఇస్తేగాని ఈ రాష్ట్రంలో ఒక సినిమా కూడా విడుదలకు నోచుకోకపోవడం బాధాకరమన్నారు. రాజధాని విషయంలో వైసీపీ ప్రభుత్వం చేసింది విష ప్రచారమేనని తేలిందని తెలిపారు.

అప్రోచ్ రోడ్డు ఎందుకు నిర్మించలేదు?

వజ్రపుకొత్తూరు: మండలంలోని నువ్వలరేవు- మంచినీళ్లపేట ఉప్పు టేరుపై నిర్మించిన వంతెనకు ఇరువైపుల కనీసం అప్రోస్ రోడ్డు వేయలేని అసమర్థ మంత్రిగా అప్పలరాజు చరిత్రలో నిలిచిపోతారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. శుక్రవారం నువ్వలరేవు వంతెన, జట్టి పనులను ఆమె పరిశీలించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ ఉప్పుటేరుపై రూ.42 కోట్లతో వంతెన నిర్మించారని శిరీష తెలిపారు. కానీ, ఈ ప్రభుత్వం అప్రోచ్ రోడ్డును కూడా నిర్మించలేక పోయిందని ఎద్దేవా చేశారు. జట్టి పనులు ఐదేళ్ల గడుస్తున్నా ఎందుకు పూర్తికాలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోతనపల్లి సాంబమూర్తి, అరసవెల్లి ఉమామహేశ్వ రరావు, గోవిందు పాపారావు, సూరాడ మోహనరావు, గుల్లచిన్నారావు, కదంబాల వెంకటరమణ, వెంకటేష్, ఆనంద్ పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

నందిగాం: మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.శివప్రసాద్, ఏపీవో ఎం.నాగరాజు తెలిపారు. 2022 ఏప్రిల్1 నుంచి 2023 మార్చి 31 వరకు చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించామని, ఈ వివరాలను ప్రజావేదికలో వెల్లడిస్తామని తెలిపారు.

వంతెన ప్రారంభించిన మంత్రి

నందిగాం: నందిగాం-హుండీ ఆర్అండ్‌బీ రహదారిలోని నారాయణపురం సమీపంలో వంశధార కాలువపై నూతనంగా నిర్మించిన మినీ వంతెనను మంత్రి సీదిరి అప్పలరాజు శుక్రవారం ప్రారంభించారు. రూ.1.58 కోట్ల ఎండీఆర్ నిధులతో ఈ వంతెనను నిర్మించారు. ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, నరసన్నపేట ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, జడ్పీటీసీ పేరాడ భార్గవి పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి వేడుకలకు ఎంపీకి ఆహ్వానం

సంతబొమ్మాళి: మండలంలోని చెట్లతాండ్ర లక్ష్మీనరసింహ ఆలయంలో ఈ నెల 20నుంచి జరిగే భీష్మ ఏకాదశి ఉత్సవాలకు ఎంపీ రామ్మోహన్ నాయుడును సర్పంచ్ పంగ అశిరినాయుడు శుక్రవారం ఆహ్వానించారు. కార్యక్రమంలో ఐటీడీపీ మండల అధ్యక్షుడు బెండి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

తీరప్రాంతాల అభివృద్ధి టీడీపీ ఘనతే



ఎస్.బి.కొత్తూరు పంచాయతీలో పర్యటిస్తున్న టీడీపీ నాయకులు

సంతబొమ్మాళి: మండలంలోని తీరప్రాంత గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. శుక్రవారం ఎస్.బి. కొత్తూరు పంచాయతీలో వారు పర్యటించారు. గత ఐదేళ్లుగా తీర గ్రామాల్లో పూర్తిగా అభివృద్ధి కుంటుపడిందన్నారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు. అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు దమ్ము రాజా ప్రతాప్, శాంతారావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు కూశెట్టి భాను ప్రకాష్, ఐటీడీపీ మండల అధ్యక్షుడు బెండి అరుణ్‌కుమార్, ఉప్పాడ డిల్లేశ్వరావు, వజ్జ ప్రభాకర్, బుచ్చ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్కురాడలో 'బాబుష్యూరిటీ'

జలుమూరు: అక్కురాడ పంచాయతీలో టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం బాబుష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వేస్తే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, నాయకులు బగ్గు గోవిందరావు, కింజరాపు సత్యం, వెలమల చంద్ర భూషణరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు టీడీపీ మినీ మేనిఫెస్టోను వివరిస్తున్న బగ్గు రమణమూర్తి

రాజధాని సినిమాతో జగన్‌కు వణుకు

నరసన్నపేట: రాజధాని ఫైల్స్ సినిమాతో జగన్‌రెడ్డి వెన్నులో వణుకు పుట్టిందని మాజీ ఎమ్మెల్యే టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజధాని సినిమాను వైసీపీ ప్రభుత్వం కుట్రపూరితంగా అడ్డుకున్నా హైకోర్టు మాత్రం విడుదలకు అనుమతి ఇవ్వడం మొదటి విజయంగా అభివర్ణించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు M/s SHRIRAM FINANCE LIMITED నరసన్నపేట బ్రాంచి నరసన్నపేట వారు ఇచ్చిన లోగట్టా ప్రకారము యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని శ్రీ/శ్రీమతి కాకి ధనలక్ష్మి W/o లేటు కాకి ధనరాజు ఉమ్మి ప్రాపర్టీని షూరిటీగా తీసుకొని ఉమ్మి కుమారుడైన కాకి రాజకుమార్ గారికి ఋణము యిచ్చుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైనను ఎటువంటి ఐక్కుల, దావాలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంటు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న ఎడల నేటి నుండి ఏడు దినములలో ఈక్రింది చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియచేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు: శ్రీకాకుళం జిల్లా, రాజాం సబ్‌డి., రాజాం మండలం, రాజాం నగర పంచాయితీ పరిధిలోగల రాజాం దరి గోపాలపురం గ్రామం తాలూకా నెం.242రు పట్టా జిరాయితీ మెట్టు సర్వే నెం.85-5-రు భాగం 1వ లైనులో పశ్చిమ నుండి తూర్పునకు ప్లాటు నెం.1,2,3,4ర్లు నాలుగు బిట్లు కలిసి ఉన్న జిరాయితీ మెట్టు ఖాళీ స్థలమునకు హద్దులు: తూర్పు పడమరలకు 60 అడుగులు (18.3మీటర్లు), ఉత్తర దక్షిణలకు 50 అడుగులు (15.25మీటర్లు) అనగా 333.33 చదరపు గజముల విస్తీర్ణం గల మెట్టు ఖాళీస్థలమునకు హద్దులు: **తూర్పు:** ప్లాటు నెం.5రు మెట్టు ఖాళీస్థలం, **దక్షిణం:** 3 అడుగుల వెడల్పు గల కాలువ స్థలం, **పడమర:** 20 అడుగుల వెడల్పు గల సమిష్టి రోడ్డు, **ఉత్తరం:** 20 అడుగుల వెడల్పు గల సమిష్టి రోడ్డు.

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759

BEFORE THE HON'BLE II ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD
OS. No. 208 of 2022

Between:
M/s. OFB Tech Private Limited, O/o #8-2-293/82/A/1264, Sai Shikha Building, 2nd Floor, Plot No 1264, Road no 36, Jubilee Hills, Near Jubilee Hills Check Post, Hyderabad. ...Plaintiff

And

M/s. Sri Durga Dry Fruits Private Limited, & Others ... Defendants

To,
2. Mr. Simhachalam Koti, S/o Late Koti Asirayya, Chowarikotturu, Kotabommali Mandal, Kurudu Panchayati, Srikakulam - 532195. ... Defendant No.2
3. Muddamma Koti W/o. Simhachalam Koti, Chowarikotturu, Kotabommali Mandal, Kurudu Panchayati, Srikakulam - 532195. ... Defendant No.3

Please take notice that the Plaintiff has filed the above OS No. 208 of 2022 against you No.1 to 3 for recovery of money. It is hereby called upon to take Notice that my client M/s. OFB Tech Private Limited, filed a Original Suit **OS No. 208 of 2022** against Defendant No. 2 and 3 before the Hon'ble II ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT at HYDERABAD. The said OS is posted to **22-02-2024 for hearing at 10:30 Hrs** and that you would have to appear in person or through an Advocate before the Court to defend your case. Please note that in the event you fail to appear on the said date of hearing, the Hon'ble Court may proceed further to pass appropriate orders in your absence in above Suit.

//By Order of Hon'ble II ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT at HYDERABAD //

Shri.A.Chandra Shaker, Advocate,
Flat No.203, II Floor, Opp. Lane to Police Officers Mess, Ivory Towers, Masabtank, Hyderabad-28 **Mobile: +91-9949071066**

నిరాటంకంగా అన్న క్యాంటీన్ సేవలు

టెక్కలి: టెక్కలిలో అన్న క్యాంటీన్ సేవలు నిరాటంకంగా కొనసాగు తున్నాయి. ఈ క్యాంటీన్‌ను ప్రారంభించి శుక్రవారం నాటికి 200 రోజులు పూర్తయింది. ఎన్ఆర్ఐ వింగ్, దాతలు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఇచ్చిన విరాళాలతో టెక్కలి, కోటబొమ్మాళిలో నిత్యం 600 మందికి ఐదు రూపాయలకే భోజనం అందిస్తున్నారు. లాడి శ్రీనివాసరావు, టీడీపీ కార్యకర్తలు పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'అన్న క్యాంటీన్ ద్వారా పేదవాడికి కడుపు నిండా అన్నం పెడుతుంటే ఓర్వలేని జగన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులకు గురిచేసింది. వాటిని అధిగమించి దాతల సహకారంతో టెక్కలి, కోటబొమ్మాళిలో అన్న క్యాంటీన్ ద్వారా సేవలు అందిస్తున్నా'మని తెలిపారు.



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న దృశ్యం

నోటీసులు సమంజసం కాదు



జలుమూరు: విజయవాడలో ఈనెల 18న జరిగే ఓటుఫర్ ఓపీఎస్ కార్యక్రమానికి వెళ్లకుండా ఉద్యోగులకు ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం సమంజసం కాదని ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు మెండ రామారావు అన్నారు. శుక్రవారం పోలీసులు ఆయనకు నోటీసులు అందజేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలను అణిచివేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఆయన విమర్శించారు.


అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు


ఇచ్ఛాపురం: శుద్ధికొండపై సూర్య నమస్కారాలు చేస్తున్న భక్తులు


జి.సిగడాం: పూజలు చేస్తున్న మహిళలు


సంతబొమ్మాళి సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో రథసప్తమి

రథసప్తమి వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

- ఆంధ్రజ్యోతి బృందం


నరసన్నపేట సూర్యనారాయణస్వామి ఆలయం వద్ద..


వజ్రపుకొత్తూరు: నువ్వలరేవు తీరంలో సూర్యుని సైకత శిల్పం


టెక్కలిలో ఆదిత్యునికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



ఆదిత్యుని దర్శనానికి మంత్రులు ధర్మాన, సీదిరి..

అరసవల్లిలో ప్రముఖుల దర్శనం.. సేవా కార్యక్రమాలు

- **అరసవల్లి:** అరసవల్లిలో ఆదిత్యుడ్ని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు తన తల్లితో కలిసి దర్శించుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అరసవల్లిని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.
- మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పాలవలస విక్రాంత్, దువ్వాడ శ్రీను, ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్, కళావతి, కంబాల జోగులు, వైసీపీ నేత దువ్వాడ శ్రీకాంత్, ఇబ్రహీపట్నం ఎమ్మెల్యే(తెలంగాణ) మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా దంపతులు, ఎస్పీ జీఆర్ రాధిక దంపతులు, టీడీపీ నేతలు గొండు శంకర్, కలిశెట్టి అప్పలనాయుడు, తదితరులు స్వామిని దర్శించుకున్నారు.
- అరసవల్లిలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.
- శ్రీకాకుళం నగరానికి చెందిన శ్రీ ధర్మశాస్త్ర సన్నిధానం నిర్వాహకుడు బరాటం సంతోష్ ఆధ్వర్యంలో సుమారు 20వేల మంది భక్తులకు ఆహార పొట్లాలు అందజేశారు. అలాగే వారు నిర్వహించిన శిబిరంలో 250 మంది భక్తులు రక్తదానం చేశారు.
- సౌత్‌ఇండియా షాపింగ్ మాల్, కనకమహాలక్ష్మి కోఆపేరేటివ్ బ్యాంక్, కాకినాడ ఆదిత్య కళాశాల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోరా, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సూర శ్రీనివాసరావు 2,500 మంది భక్తులకు పులిహోర, తాగునీటి ప్యాకెట్లను అందజేశారు. జిల్లా మాజీసైనికుల సమాఖ్య ఆధ్వర్యంలో ఇంద్ర పుష్కరిణి వద్ద క్యూలైన్లలో భక్తులకు మజ్జిగ, నీరు, బిస్కట్ ప్యాకెట్‌లను పంపిణీచేశారు. సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.
- రథసప్తమి వేడుకల సందర్భంగా నగరంలోని స్థానిక మిల్లు జంక్షన్ వద్ద గొండు శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గత 300 రోజులుగా అన్నక్యాంటీన్ ద్వారా నడుస్తుండగా, రథ సప్తమి సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సుమారు 1500 మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.


టెక్కలి: ఆదిత్యుని ఆలయం వద్ద భక్తుల క్యూలైన్


అరసవల్లి: అన్నదానం, ప్రసాదం పంపిణీ చేస్తున్న గుండ లక్ష్మీదేవి, సూరశ్రీను


వీల్‌చైర్‌పై వృద్ధురాలిని..


ఎస్పీ రాధిక దంపతులు


ఎల్ఎన్ పేట: బొర్రంపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో..


కవిటి: తీరంలో పూజలు చేస్తున్న భక్తులు


సరుబుజ్జిలి: సూర్యదేవునికి క్షీరాభిషేకం..


అరసవల్లి: అన్న క్యాంటీన్ ద్వారా అన్నదానం చేస్తున్న దృశ్యం


జలుమూరు: శ్రీముఖలింగంలో..

శతాధిక వృద్ధురాలి మృతి


నీలమ్మ(ఫైల్)

పొందూరు: తాడివలసకు చెందిన శతాధిక వృద్ధురాలు పైడి నీలమ్మ (101) గురువారం మృతి చెందారు. విశాఖలో చిన్న కుమారుడు పాపారావు వద్ద నీలమ్మ ఉంటున్నారు. కాలకృత్యాలు తీర్చుకుని వస్తున్న నీలమ్మకు గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. నీలమ్మ మృతదేహాన్ని స్వగ్రామం తాడివలస తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. నీలమ్మకు ముగ్గురు కుమారులు గణపతి, రమణ, పాపారావుతోపాటు నలుగురు కుమార్తెలు కృష్ణవేణి, లక్ష్మీనారాయణ, సావిత్రి, గున్నమ్మ ఉన్నారు. కాగా నీలమ్మకు 64 మంది మనుమలు, మనమరాళ్లు, మునిమనమలు, మునిమనుమరాళ్లు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

ఆమదాలవలస: పట్టణంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జాడ దుర్గారావు (47) చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. రైల్వే అండర్ టన్నల్ వద్ద ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో గాయపడిన దుర్గారావును 108 సిబ్బంది శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దుర్గారావు భార్య సూర్యరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

బీసీ సంఘ జిల్లా అధ్యక్షుడు..


చంద్రపతిరావు (ఫైల్)

శ్రీకాకుళం క్రైం: బీసీల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు పిట్టా చంద్రపతిరావు గురువారం అర్ధరాత్రి 2 గంటలకు తన నివాసంలోనే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు బీసీ సంఘ నేతలు, రాజకీయ నాయకులు శుక్రవారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. శనివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు సంఘ నేతలు, కుటుంబ సభ్యులు తెలిపారు.

చోరీ కేసులో ఒకరికి జైలు

జి.సిగడాం: బంగారం చోరీ కేసులో ఒకరికి జైలు శిక్ష పడినట్టు ఎస్ఐ వై.మధుసూదనరావు తెలిపారు. పెంట గ్రామంలో 2021లో బంగారం చోరీకి పాల్పడిన కాకర్ల కృష్ణకు పొందూరు కోర్టు న్యాయాధికారి బి.జోత్స్న విచారణ చేపట్టి ఏడాది పాటు సాధారణ జైలు శిక్ష, రెండు వేల రూపాయల జరీమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. పెంట గ్రామానికి చెందిన మక్క యశోధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఎంఏ అహ్మద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయాధికారి శిక్ష ఖరారు చేశారు.

రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ

రణస్థలం: రావాడ పంచాయతీ పరిధిలోని ఉప్పువలస గ్రామానికి చెందిన రైతుల వ్యవసాయ బోర్లుకు సంబంధించిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియన వారు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన రైతులు చెప్పిన వివరాల మేరకు ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం వ్యవసాయానికి నీరు పెట్టడానికి బోర్లు వద్దకు వెళ్లేసరికి విద్యుత్ వైర్లు వేళాడుతున్నాయి. స్తంభానికి ఉన్న ట్రాన్స్‌ఫారాలు కిందకి దించి దానిలో ఉన్న కాపర్ వైరును చోరీ చేశారు. మరో ట్రాన్స్‌ఫారం నుంచి కాపర్ వైర్లు చోరీ చేసి దగ్గరలో ఉన్న నూతిలో మిగిలిన మెటీరియల్‌ను విడిచిపెట్టారు. తక్షణమే అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేయాలని రైతులు ఎం సూర్యనారాయణ, నొడగల సోములు తదితరులు కోరుతున్నారు. ఈ చోరీపై పైడిభీమవరం విద్యుత్ సిబ్బందికి రైతులు ఫిర్యాదు చేశారు.

కూర్మనాథుని సన్నిధిలో ఆర్‌జేసీ


స్వామివారి చిత్ర పటాన్ని అందిస్తున్న ఈవో

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథుని దేవదాయ శాఖ ఆర్‌జేసీ కె.విజయరాజ్, దేవదాయ శాఖ పీఏస్ సురేష్ శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి, స్వామి వారి ప్రసాదాన్ని చిత్ర పటాన్ని ఆలయ ఈవో గురునాథరావు వారికి అందచేశారు.

టీడీపీతోనే అభివృద్ధి: ఎమ్మెల్యే అశోక్


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం మున్సిపాల్టీ పరిధిలో గల వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. 21వ వార్డు గొల్లవీధిలో ఎంపీ నిధులు రూ.5లక్షలతో సామాజిక భవనం, 17వ వార్డు సంతపేటలో ఎంపీ నిధులు రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలో ఉన్న నాలుగున్నరేళ్లలో ఒక్క రోడ్డు గాని, సామాజిక భవనం గాని నిర్మించలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని, రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ, కౌన్సిలర్లు కాళ్ల వెంకటలక్ష్మి, కాళ్ల దిలీప్, పత్రి తవిటయ్య, ఆశి లీలారాణి, జి.శేఖర్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కాళ్ల జయదేవ్, రెయ్యి జానికీరావు, ఆశి జీవులురెడ్డి, ఊనా సంతోష్, సాలిన జగదీష్, జిలాని, కొరాయి ధర్మరాజు, దక్కత ఢిల్లీరావు, సీపాన వెంకటరమణ, మణిచంద్రప్రకాష్ పాల్గొన్నారు.

- **కవిటి:** కవిటి కొత్తూరు గ్రామంలో ఎంపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు టీడీపీ హయాంలోనే ఎక్కువగా వెచ్చించినట్టు తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మణిచంద్ర ప్రకాష్, నాయకులు బి.రమేష్, ఎస్.వెంకటరమణ, కె.వాసు, సంతోష్‌పట్నాయక్, బి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలుని కల్యాణానికి పందిరి రాట


పందిరి రాటకు పూజలు చేస్తున్న దృశ్యం

గార: ప్రసిద్ధ శ్వేతగిరిపై వెలసిన వేణుగోపాల స్వామి వారి కల్యాణ మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం ముహూర్తపు రాట (పందిరి రాట) పూజలు చేశారు. ఈ నెల 24న పౌర్ణమి రోజున ఇక్కడ స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి ముహూర్తపు రాటను వేయడం జరిగింది. ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ సుగ్గు మధురెడ్డి, లక్ష్మీనృసింహ దేవి దంపతులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు సాయిశర్మ, సర్పంచ్‌పాల్గొన్నారు.

టీడీపీలో 15 కుటుంబాలు చేరిక


కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గొండు శంకర్

అరసవల్లి: శ్రీకాకుళం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి గదేల లక్ష్మి ఆధ్వర్యంలో 15 కుటుంబాలు టీడీపీ యువ నాయకుడు, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు గొండు శంకర్ సమక్షంలో శుక్రవారం పార్టీలో చేరారు. వారందరికి కండువాలు కప్పి గొండు శంకర్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, దండపాటి నవీన్‌కుమార్, గురుగుబెల్లి కమలనాథ్, పొన్నాడ కిషోర్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు కొర్ను నాగార్జున ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ పర్యటనతో వైసీపీలో వణుకు

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కళావెంకటరావు


శంఖారావం కిట్లు పంపిణీ చేస్తున్న కళావెంకటరావు

జి.సిగడాం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పర్యటన వైసీపీ నాయకులు వెన్నులో వణుకు పుట్టించిందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు, రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు అన్నారు. శుక్రవారం మండల క్యాంప్ కార్యాలయంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నవరత్నాలు పేరుతో నవ మోసాలు చేసిన సీఎం జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన జగన్‌రెడ్డిని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. అన్ని రంగాల్లో తిరోగమణంలో ఉన్న రాష్ట్రాన్ని గాడీలో పెట్టే సత్తా చంద్రబాబుకే ఉందన్నారు. లోకేశ్ శంఖారావం సభలను విజయవంతం చేసిన టీడీపీ నాయకులకు, అభిమానులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పనిచేసి చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం శంఖారావం (సూపర్ సిక్స్) కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుమరాపు రవికుమార్, టంకాల మౌళీశ్వరరావు, కూనుబిల్లి కూర్మారావు, పైల రామకృష్ణ, బెవర జగన్నాధరావు, కంచరాన సూరన్నాయుడు, జక్కంపూడి దాసు, బోగాది అప్పలనాయుడు, నక్క మురళి, మహాదాశ్యం చిన్నారావు, బంగారినాయుడు, మహేష్, ముత్యాలు, సాయుకుమార్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి వెన్నులో వణుకు ఆరంభం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం): ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వెన్నులో వణుకు ఆరంభమైందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నుంచి దోచుకోవడం.. దాచుకోవడం లక్ష్యంగానే పాలన సాగిందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని నిలబెట్టిన ఘనత జగన్‌రెడ్డిదేనని చెప్పారు. మూడు రాజధానుల పేరుతో ఏపీని నిలువు దోపిడీ జగన్ అండ్ కో చేశారని చెప్పారు. రాజధాని ఫైల్స్ సినిమాలో వాస్తవాలను ప్రజలకు చూపించారని.. సైకో సీఎం ఆ సినిమాను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.

ఆకట్టుకున్న సినీస్వర మాధురి


గీతాలాపన చేస్తున్న గాయకులు

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ గాయకుడు జి.ఆనంద్ జయంత్యుత్సవాన్ని అతడి సోదరులు జి.బాలరాజు, జి.వీరరాజు ఆధ్వర్యంలో గురువారం బాపూజీ కళా మందిర్‌లో నిర్వహించారు. సినీగేయాలతో సినీస్వర మాధురి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకులు నిక్కు అప్పన్న, రేజేటి సతీష్ కుమార్, లక్ష్మి, పవన్, రమ, కేఎల్ఎన్ మూర్తి, ఎంవీ కామేశ్వరరావు తదితరులు జి.ఆనంద్ పాడిన పాటలతో పాటు ఇతర భక్తి పాటలు, సినీ గీతాలు ఆలపించారు. అదే విధంగా కళా ప్రవీణ బండారు చిట్టిబాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహన రావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు నటుకుల మోహన్, పొన్నాడ రవి, డోల జగన్, ఎం.శ్రీకాంత్, ఎం.శారద తదితరులు పాల్గొన్నారు.

రూ.4 లక్షల విరాళం

పొందూరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పొందూరు పైడితల్లి అమ్మవారి ఆలయానికి రంగుల వేసేందుకు తిరుపతికి చెందిన భక్తులు ముందుకు వచ్చారు. సుమారు పదేళ్ల కిందట పొందూరు, పరిసర గ్రామాల భక్తుల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేశారు. రంగులు వేసేందుకు సుమారు రూ.10 లక్షలు అవసరం కావడంతో పనులు ముందుకు సాగలేదు. ఈ క్రమంలో తిరుపతిలో నివాసం ఉంటున్న పొందూరు గ్రామానికి చెందిన దండా కామేశ్వరరావు బంధువులు అల్లంశెట్టి ఆంజనేయులు, విద్య దంపతులు ముందుకు వచ్చి రూ.4 లక్షలు విరాళంగా అందించారు. రూ.6 లక్షలు పొందూరు, పరిసర గ్రామాలకు చెందినవారు అందించారు. దీంతో ఆలయానికి రంగులు వేస్తున్నారు. మరో నెల రోజుల్లో జరగనున్న పైడితల్లి అమ్మవారి జాతర నాటికి ఆలయాన్ని సిద్ధం చేయనున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఫ్లై ఓవర్ నిలుపుదల చేయాలి

రణస్థలం: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రణస్థలం వద్ద ఫ్లైఓవర్ వద్దు, బైపాస్ ఏర్పాటు చేయాలని శుక్రవారం పలువురు వ్యాపారులు ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఫ్లై ఓవర్ ఏర్పాటు చేస్తే చాలా మంది వ్యాపారులు వీధిన పడతారన్నారు. సమస్యలతో కూడిన వితన పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాల్టీలో లాలాపేటలో మజీద్ వద్దకు సీసీ రోడ్డుకు రూ.3 లక్షలు, 6వ వార్డుకు సంబంధించి రూ.1 లక్షలతో కల్వర్టు నిర్మాణం, బాపూజీ గ్రంథాలయానికి రూ.1.18 లక్షలు పురపాలక నిధులతో మరుగుదొడ్లు నిర్మాణానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి శుక్రవారం భూమి పూజలు చేశారు. కార్యక్రమంలో 17వ, 6వ వార్డు కౌన్సిలర్లు టెంక లక్ష్మి, పరపటి మంజులత, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, పరపటి కోటి, ప్రకాష్ పట్నాయక్, టి.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

'నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు'

రణస్థలం: నిరాధరణ ఆరోపణలు చేస్తే ఊరికొనేది లేదని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లావేరు మండలంలో జరిగిన టీడీపీ శంఖారావం కార్యక్రమంలో తన పై లోకేశ్ తప్పుడు ఆరోపణలు చేశారని, తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. ఇసుక, గ్రావెల్ ద్వారా డబ్బు సంపాదించానని నిరూపిస్తే దేనికైనా రడీ అని సవాల్ విసిరారు. అక్రమంగా భూములు సంపాదించవల్సిన అవరం లేదని, గొర్లె కుటుంబం ఆది నుంచే భూములు ఉన్నవారమన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గం హద్దులు కూడా తెలియని జనసేన పార్టీ నేత విశ్వక్సేన్ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో మహంతి పెద్దరామినాయుడు, రొక్కం బాలకృష్ణ, దన్నాన రాజనాయుడు, లుకలాపు శ్రీను తదితరులు ఉన్నారు.

22 దుకాణాలపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం: స్టేట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ హనుమంతు అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవార జిల్లాలోని సోంపేట, పలాస, కోటబొమ్మాళి మండలాల్లోని 60 దుకాణాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. వీటిలో 22 షాపులపై కేసులు నమోదు చేశారు. ఎటువంటి మోసాలకు అవకాశం లేకుండా ఉండేలా తనిఖీ చేస్తున్నట్టు విజయనగరం డిప్యూటీ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ బి.మధుసూధన రెడ్డి విలేకరులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నామన్నారు. అసిస్టెంట్ కంట్రోలర్ రాధాకృష్ణ, ఎన్‌వీ రమణమూర్తి, పీవీడీ విడి అప్పలరాజు, పలువురు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



సముద్ర జలాలతో అభిషేకం

కవిటి: ముత్యాలపేట గ్రామంలో కొత్తగా నిర్మించిన మహామృత్యుంజయ ఆలయ ప్రాంభోత్సవం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు సముద్రం నుంచి జలాలను తీసుకువచ్చి ఆలయ ప్రారంభోత్సవానికి అంకురార్పణ చేశారు. ఎనిమిది ఆలయాల సమూహం ప్రారంభోత్సవంలో గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.